

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 12 సంచిక : 12 ఆగష్టు 2007



**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

**పేజీలు : 20**

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(ఫ్రైమ)

**చందా**
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా
**రమణ భాస్కర**
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


**ఈ సంచికలో....**


గుండుగొలను ... 05-04-07

చింతపర్రు ......... 08-07-07

జిన్నూరు............ 17-06-07



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


# ద్వేషానికి మూల కారణం - ద్వైతం

ఉన్న సత్ పదార్థం ఒక్కటి అంటే ఒక్కటిగానే ఉంది. అది మన అనుభవంలో లేక ద్వైతాన్ని కల్పించే మనో పరిధిలో ఉండి ద్వేషాలతో రగిలిపోతున్నాము. దూషించేవాడు, దూషణమును పొందేవాడు ఒక్కడే అయినప్పుడు దూషణ, భూషణలు లేవు. అద్దాలగదిలో కుక్క ప్రవేశిస్తే అన్ని వైపులా తన రూపమే అని తెలియక, అన్ని తనకు భిన్నమైనవని మొరుగుతూ ఉంటుంది. ద్వైత భావన ఉన్న మానవుని స్థితి అంతే ద్వైతం ఉన్న చోట ఆపదలు, సంశయాలు ఉన్నచోట శోకాలు ఉంటాయి. ద్వైత భావన నశించాలి అంటే మనకు మనం అధిపతులు అయినప్పుడే ప్రపంచానికి అధిపతి అవుతాము. శరీర లంపటత్వమే భయానికి కారణం. డబ్బయి కేజీలు ఉన్న మనం చిన్న ఎలుకను చూచి భయపడతాము. మన మనస్సులో ప్రేమ ఉంటే ప్రేమ, ద్వేషం ఉంటే ద్వేషం మనకు బయట కనబడతాయి. మనలను వీళ్ళు వంచన చేసి మోసం చేస్తారు అనుకొంటే అన్ని వైపుల నుంచి మోసగాళ్ళు బయలుదేరి మన మీద వాలిపోతారు. నిర్భయత్వం మనకు పట్టుకొమ్మ కావాలి. మన హృదయంలో ఎప్పుడూ పవిత్రతే ఉండాలి. అప్పుడే మనకు అమంగళం ఉండదు. జీవిత విజయం ఆధ్యాత్మిక విజయం ఒక్కటే దాన్ని విడదీయ నెంచేవారు భ్రాంతులకు లోనౌతారు. నేను పాపిని, మూర్ఖుడను, నీచుడను అనే దీనాలాపాలు పోవాలి. ఆత్మశక్తిని నేనే అని విశ్వసించాలి. శత్రు రూపాలు, మిత్ర రూపాలు మనం నిజమని నమ్ముతాము. అవి మోసం చేస్తాయి. అప్పుడే మనం వాటి మీద పగ తీర్చుకోవాలని, మిత్రుడు అయితే ఆప్యాయత కలిగి ఉండాలని అనిపిస్తుంది. అది చాలా చెడ్డది. నిందించటం వల్ల మన పరిస్థితి ఇంకా విషాదంగా మారిపోతుంది. అసలు మొదటి తప్పు

భగవంతుని మీద మాత్రమే ఉంచదగ్గ విశ్వాసాన్ని ఈ దృశ్యరూపాల మీద ఉంచి వాటిని ప్రేమించటం ద్వేషించటం. రెండవ తప్పు ఆ రూపాలు నిజమని నమ్మి మరింత ఆరోపించి తీవ్ర బాధలు అనుభవిస్తున్నాము. శ్రీ నాన్నగారు "దృశ్యం గురించిన జ్ఞానమే బంధము. కర్త తాను అనుకోవటం వల్లనే దుఃఖం వస్తుంది. ఎక్కడ తలంపులు, ఊహలు లేవో అక్కడ సత్యం ఉంది" అన్నారు. మన జీవితంలో పొందదగినది శివతత్త్వమే అదే సజీవ సత్యం. సాక్షికి సాక్షిగా తయారవ్వాలి. అక్కడ ద్వైతం లేదు. అదే సమాధి స్థితి.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 05-04-07, గుండుగొలను)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

పూర్వపురోజులకు, ఇప్పటికి మనలో సహనం తగ్గిపోయింది. సహనం తగ్గిపోవటం వలన మనం జీవితంలో ఓడిపోతున్నాము, మీ మనస్సును విషయాలకు అప్పచెప్పేబదులు, బుద్ధికి అప్పచెప్పండి. బుద్ధికి రీజన్ ఉంటుంది, బుద్ధి మనస్సును బాగుచేస్తుంది అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఈ దేహం ఎంతకాలం బతకాలి అనేది ప్రారబ్ధాన్నిబట్టి ఉంటుంది. మనకు దేహం నేను అనే తలంపు ఉంది. మనం కాని దేహాన్ని, మనం కాని మనస్సును మనం అనుకొంటున్నాము. ఇలా మనం ఏదైతే కాదో వాటితో కలిసిపోయి శుభ్రంగా పాడైపోతున్నాము. మనం కానిదానితో, దేనితో తాదాత్మ్యం పెంచుకొన్నా మరల భవిష్యత్ జన్మలలో దానిని తగ్గించుకొంటూ వస్తేగాని మనం గూటిలో పడము. దేహభ్రాంతి ఉన్న వాడికి దేహం వస్తుంది, దేహభ్రాంతి లేనివాడికి దేహం రాదు అంటే వాడికి పునర్జన్మరాదు. బాధలేని మనిషి ఉండడు. మాకు బాధలేదు, మాకు అశాంతి లేదు అని ఇందులో ఒక్కరు చెప్పండి. వేయికోట్ల డబ్బు ఉన్నవాడు కూడా నాకు బాధలేదు అని చెప్పలేడు. ప్రతీమనిషికి అశాంతి, బాధ ఉంది, అది జీవలక్షణం. వాడికి మోక్షం వచ్చేవరకు వాడు బాధ లేకుండా ఉండలేడు. అయితే ఈ బాధలు అన్నీ మనస్సు కల్పిస్తోంది. ఇష్టం, అయిష్టం లేకుండా మనం ఉండలేకపోతున్నాము. ఈ ఇష్టాలు, అయిష్టాలు బాధలే. ఇవి బాధలు అన్న సంగతి మనకు తెలియటం లేదు, ఎవరో ఇతరుల వలన మనకు బాధలు వస్తున్నాయి అని అనుకొంటున్నాము. ద్వేషం ఎంత బాధో, రాగం కూడా అంతే బాధ. రాగద్వేషాలను వదులుకొంటే ఇప్పడు ఇక్కడ కూర్చొన్నవారు లేవకుండా మీకు బాధ, అశాంతి తగ్గిపోతుంది. సబ్జక్టును జాగ్రత్తగా అర్థం చేసుకోండి. రాగద్వేషములు ఉన్న మనిషి శాంతిగా ఉండలేడు, వాడి మనస్సు శాంతిగా ఉండనివ్వదు. గాఢనిద్రలో మనకు ఇష్టాలు, అయిష్టాలు లేవు అందుచేత మనం శాంతిగా ఉండగలుగు తున్నాము. షాపు మూసే

ముందు యజమాని ఆ రోజు ఎక్కౌంటు అంతా చూసుకొంటాడు, ఎక్కువ ఖర్చు అవుతూ ఉంటే ఎలా తగ్గించాలి అని చూస్తాడు. అలాగే సాధకులు ఈ రోజు మనం ఎలా జీవించాము అని ప్రతీరోజూ పరిశీలన చేసుకోవాలి. ఈరోజు మనం ఎంతవరకు సవ్యంగా మాట్లాడాము, ఎన్ని మాటలు అపసవ్యంగా మాట్లాడాము, ఎన్ని మంచి పనులు చేసాము, ఏవైనా పొరపాటు పనులు చేసామా అని ఏరోజుకారోజు మననం చేసుకొంటే మరుసటి రోజు జాగ్రత్తగా ఉండే అలవాటు వస్తుంది. మనం బాగుపడటానికి, పాడైపోవటానికి కూడా మనస్సే కారణం. మనస్సును బాగుచేసుకోవటం, మనస్సును నిగ్రహించుకోవటం కంటే ముఖ్యమైన పని ఈ ప్రపంచంలో ఇంకొకటి లేదు. ఎంతోకొంత కష్టపడితేనేగాని డబ్బు సంపాదించలేము. అంతకంటే ఎక్కువ కష్టపడితేగాని గౌరవం రాదు. మరి జ్ఞానం సంపాదించటానికి ఇంక ఎంత కష్టపడాలో చూడండి.

దేహాభిమానం ఉన్నంతకాలం మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. మనం సదాచారం, సత్‌ప్రవర్తన విడిచిపెట్టకూడదు. దేహము నేను అనే తలంపు ఉన్నప్పుడు నేను నీకు సేవకుడను, దాసుడను, నేను ఆత్మ అనుకొన్నప్పుడు నువ్వే నేను అని ఆంజనేయస్వామి అంటాడు. అప్పుడు రామచంద్రమూర్తి ఏమన్నాడు అంటే ఎప్పుడూ నీవు నా బ్రహ్మస్వరూపాన్ని ధ్యానం చేస్తున్నావు, ధ్యానం నీకు ఆరోప్రాణం, నన్ను నామరూప రహితంగా చూస్తున్నావు, నా స్వరూపం ఏదిగా ఉందో దానిని ధ్యానం చేస్తున్నావు. అలా నిరంతరం ధ్యానం చేయటం వలన లోకంలో ఏమి భావన వచ్చింది అంటే ఆంజనేయస్వామి చేసే పని అంతా రాముడిదే, ఆంజనేయ స్వామికి రాముడికి బేధం లేదు, ఆంజనేయస్వామికి నమస్కారం పెడితే రాముడికి అందుతుంది అనే జనవాక్యం వచ్చింది. అందుచేత రామాలయంలో ఆంజనేయస్వామి లేకుండా ఉండడు. మంచిపనులు కూడా భయం వలన చేయకూడదు, అలా చేస్తే భయం పెరిగిపోతుంది. నీ మనస్సు నిర్మలం అయినప్పుడు, నిశ్చలం అయినప్పుడు, పవిత్రం అయినప్పుడు దాని మొఖం జ్ఞానం వైపుకు తిరుగుతుంది. మనలో జ్ఞానం కోరుకొనేవారు ఎంతమంది ఉన్నారు? జ్ఞానం ఎవరికి అక్కర లేదు. జ్ఞానం వలన సుఖం, శాంతి, స్వాతంత్ర్యము వస్తాయి. జ్ఞానం వలన మనం పరబ్రహ్మంలో ఐక్యమవుతాము. ఇంతమేలు చేసే జ్ఞానం ఎవరికి అక్కరలేదు. దీనికి కారణం ఏమిటి అంటే మనుషులకు చీపురుకట్ట విలువ తెలుస్తోంది కాని జ్ఞానం విలువ తెలియటంలేదు అని ఐన్‌స్టీన్ అన్నాడు. నేను ఉద్యోగానికి రాజీనామా చేసి, ఇల్లు విడిచిపెట్టి జ్ఞానం కోసం వెతుకుతాను అని ఒక భక్తుడు భగవాన్‌తో అంటున్నాడు. జ్ఞానం ఎక్కడ ఉంది నీ హృదయంలోనే ఉంది అంటున్నారు భగవాన్. ఇల్లు విడిచిపెట్టి వెళితే ఏదో వస్తుందని అనుకొంటున్నావు. ఇల్లు విడిచిపెడితే నీవు రోజూ తాగే కాఫీ కూడా నీకు దొరకదు. రహస్యం

అంతా నీ మనస్సులో ఉంది. మనోనిగ్రహం కోసం నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే, ఏరోజుకారోజు నీ ప్రవర్తనను సరిచేసుకొంటూ ఉంటే నీవు ఇంటి దగ్గర ఉన్నా జ్ఞానం వస్తుంది. దేహగతమైన నేనులో నుండి విడుదలపొందటానికి ప్రయత్నం చేసి, దానిలోనుండి బయటకువస్తే అదే మోక్షం. మీకు రూపబుద్ధి, నామబుద్ధి నశించింది అనుకోండి ఇక్కడ కూర్చొని ఉండగానే మీకు భరించలేని శాంతి వస్తుంది. ఏ జీవుడు స్వతంత్రుడు కాదు. ఇంటికి ఆలస్యంగా వెళితే తిడతారని మీకు భయం ఇంక మీరు ఎలా స్వతంత్రులు. నిజంగా మనం లేము, భగవంతుడు ఉన్నాడు ఇది మీకు అర్థమైతే యోగాభ్యాసములతో సంబంధం లేకుండా శాంతి వచ్చి మీ సహస్రారాన్ని ముంచేస్తుంది. కాని మనందరము ఏమనుకొంటున్నాము అంటే మనం ఉన్నాము అనుకొంటున్నాము. నిజంగా మనం లేము అనేది అనుభవంలోనికి వచ్చేవరకు అశాంతి మనలను విడిచిపెట్టదు, పునర్జన్మలు విడిచిపెట్టవు, ఏదో శవాన్ని మోస్తూ ఉండవలసిందే.

మనం డబ్బు, పాండిత్యం సంపాదించగలము కాని కాలాన్ని సంపాదించలేము. జరిగిపోయిన గంటకాని, నిమిషంకాని తిరిగిరాదు. నిన్న పోగొట్టుకొన్న డబ్బు ఈరోజు సంపాదించుకోగలము కాని నిన్నటి రోజు రమన్నా రాదు. మనకు కాలం విలువ తెలియటం లేదు. భగవంతుడు మీకు కేటాయించిన పనిని శ్రద్ధగా చేసుకొంటూ మిగతా టైమును భగవదనుభవం పొందటానికి ఉపయోగించుకోండి. మనం చనిపోయే రోజు వస్తుంది అనుకోండి ఇంకో పది రోజులు బతికితే బాగుండును, రామనామం చేసుకోవచ్చు అంటే పది రోజులు కాదు కదా పది క్షణాలు కూడా ఆపుచేసుకోలేము. ఆ దేహప్రారబ్ధం అయిన వెంటనే ముక్కులో గాలి ఒక్క క్షణం కూడా ఉంచడు. కొంతమందికి చాలాడబ్బు ఉంటుంది, టైముకు కాఫీ ఇచ్చేవారు కూడా ఉండరు. అదొకరకమైన ప్రారబ్దం. కొంతమందికి ఎంత తిన్నా బాగా అరుగుతుంది, తినటానికి జేబులో డబ్బులు ఉండవు. అదొకరకమైన ప్రారబ్దం. ఇక్కడ మీరు అర్థం చేసుకోవలసింది ఏమిటి అంటే దేహం ఈ భూమి మీదకు ఎందుకు వచ్చిందో ఆ ప్రారబ్దం అనుభవించి వెళ్ళిపోతుంది. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి నీవు జ్ఞానసముపార్జనకు ప్రయత్నం చెయ్యి. అర్జునా! వీరందరు బంధువులు వీరులు వీరిని చంపటం ఎలాగ అని నీ అహంకారం ఆలోచిస్తోంది. నీవు ఎవరిని చంపాలి అనుకొంటున్నావో వారినందరిని నేను చంపే ఉంచాను. నేను చంపినవారిని చంపటమే అంటే పని నాది, నీవు చేతులు ఆడించటమే. చేతులు ఆడిస్తున్నావు కాబట్టి గౌరవం నీకు వస్తుంది. భగవంతుడు చేసే పని నిర్మలంగా చేస్తాడు, వాడికి గుర్తింపులు అక్కరలేదు. సృష్టే లేనివాడికి ఇంక గుర్తింపులు ఏమిటి? ఇంటి దగ్గర గుర్తింపులు ఆశించకుండా, గౌరవాలు ఆశించకుండా ఇది మన డ్యూటీ, భగవంతుడు

ఈ పనిని మనకు కేటాయించాడు అని నిర్మలంగా పనులు చేసేవారు మీలో ఎంతమంది ఉ న్నారు. ఇంటిదగ్గర బోలెడు చాకిరీ చేస్తున్నాము కాని ఎవరూ గుర్తించటం లేదు అని చాలామంది అంటున్నారు. ఎవరైతే గుర్తించాలని మీరు అనుకొంటున్నారో, వారి దగ్గర తాళం చెవి లేదు, మీలో అంతర్యామిగా ఉన్న భగవంతుడి దగ్గర తాళం చెవి ఉంది. ఆయన గుర్తిస్తే మీకు మోక్షం ఇస్తాడు. బయట వారు గుర్తించి, భగవంతుడు గుర్తించకపోతే మన పని సున్న. మన మనస్సులో మాలిన్యం ఎక్కువగా ఉంటే భగవంతుడి మాటయందు గౌరవం ఉండదు, ఆయన మీద విశ్వాసం కలుగదు, అక్కడ నుండి మన పతనం ప్రారంభమవుతుంది. ఎప్పుడైనా మనం సత్కర్మ చేస్తే కదా మన మనస్సు బాగుపడటానికి, మంచి బుద్ధి కలగటానికి. నీకు భగవంతుడి యందు ప్రేమ కలిగితే, ఆ ప్రేమ నిజమైతే ఆయనలో ఐక్యమవుతావు.

ఈ దేహమే నిజం అనుకొంటూ ప్రతిజన్మలోను ఏదో శవాన్ని వేసుకొని తిరుగుతూ ఉంటాము. ఏదో గురువు అనుగ్రహం వలన ఈ శవబుద్ధిలో నుండి బయటకురావాలి కాని కేవలం మన తెలివితేటల వలన ఇందులో నుండి బయటకు రాలేము. మనం నేను, నేను అంటాము, ఇది చిన్న నేను, ఇది ఎప్పుడూ ఏదో ఒకటి కోరుతూ ఉంటుంది. ఆ కోరికే నిజం అనుకొని ఆ కోరికల చుట్టూ, విషయాల చుట్టూ కొన్ని లక్షల జన్మలు తిరుగుతూ ఉంటాము. మనకు దేహబుద్ధి ఉంది కాబట్టి పెద్దలు విగ్రహారాధన పెట్టారు. ఒక విగ్రహాన్ని అక్కడ పెట్టి వేద మంత్రాలతో దైవాన్ని అక్కడ ఆపాదిస్తున్నారు. నీవు దేహంలో ఉన్నానని అనుకోవటం ఎంత నిజమో దేవుడు ఆ విగ్రహంలో ఉన్నాడు అనుకోవటం అంతే నిజం. నీకు దేహబుద్ధి ఉన్నంత కాలం విగ్రహారాధన చేయటం తప్పదు, విగ్రహారాధన చేయటంలో పొరపాటు లేదు అన్నారు భగవాన్. భగవంతుడు నీకు కష్టాలు ఎందుకు పంపుతున్నాడు అంటే వాటిలో నుండి నీవు పాఠాలు నేర్చుకోవాలి, వాటి ద్వారా మీ మనస్సును సంస్కరించటానికి, మీ మనస్సును జ్ఞానం వైపుకు తిప్పటానికి భగవంతుడు కష్టాలు పంపుతున్నాడు. నీకు స్వార్థపూరిత కోరికలో నుండే దుఃఖం వస్తోంది, అశాంతి వస్తోంది. నీకు స్వార్థం లేకుండా ఒక తలంపు వస్తే అది నిన్ను బంధించదు సరికదా నీ బుద్ధిని బాగు చేస్తుంది, నీవు బంధంలో నుండి బయటకురావటానికి అది నీకు సహకరిస్తుంది. లోపల స్వార్థం పెట్టుకొని నీకు తలంపులు వస్తూ ఉంటే నీకు అశాంతి, దుఃఖం రాకుండా ఎలా ఉంటుంది. మీరు, నేను, ఈ లోకం గొడవలు అన్నీ మనస్సు యొక్క కల్పితమే. మనస్సు ఎక్కడ నుండి అయితే వస్తోందో అది కల్పితం కాదు. అందుచేత మనస్సును ఉపసంహరించి దాని మూలంలోనికి పంపగలిగితే అక్కడ ఉన్న భగవంతుడు నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. మేము మంచివారము అని

మీరు అనుకొంటే సరిపోదు, అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడు అనుకోవాలి. నీవు బాగుపడాలంటే నీవు మీ ఇంట్లో వారిని ఎంతో కొంత ప్రేమిస్తున్నావు కదా అలాగే ఈ సృష్టిని ప్రేమించటం ప్రారంభించు. మీ ఇంట్లోవారు మిమ్మల్ని తిడుతున్నారు అనుకోండి లేకపోతే ఇంట్లోవారు మిమ్మల్ని పొడుగుతున్నారు అనుకోండి, మిమ్మల్ని తిట్టేవారు మీరే, మిమ్మల్ని పొగిడేవారు మీరే అని మీకు అర్థమైతే ఏ గొడవ లేదు, ఇష్టాయిష్టాలు పోతాయి. మద్వాచార్యులవారి సాంప్రదాయంలో మోక్షం ఎప్పడు వస్తుందని కనిపెట్టుకొని ఉండరు. భగవంతుడు వచ్చి నీకు కోటి జన్మల తరువాత మోక్షం వస్తుంది అంటే కోటి జన్మల తరువాత అయినా మోక్షం వస్తుంది కదా సరిపోతుంది అంటాడు ఆ భక్తుడు. దేనికి ఎదురుచూడరు, నిరాశపడరు. మనం అయితే బెంగపెట్టుకొంటాము. నీవు అన్నంతినేటప్పడు కాళ్ళు చేతులు కడుక్కొని అన్నం తిను. మడ్డిగా ఉండి తినవద్దు. ముందు నీ దేహానికి శుచి అలవాటు చేస్తే నీ బుద్ధికి శుచి వస్తుంది. చలికి బయపడి ఒక సాధువు స్నానం చేయకుండా స్నానం చేసాను అని మనస్సులో అనుకొంటాను అన్నాడు, భోజనం చేసాను అని మనస్సులో అనుకో అన్నారు గురువుగారు. ఎన్ని చిల్లర తిండ్లు తిన్నా అన్నం తినకపోతే మనకు సుఖంగా ఉండదు. అన్నం పరబ్రహ్మస్వరూపం. ఏదో పిండాకూడు తింటున్నాము అంటారు, అలా అనకూడదు. అన్నం శుచిగా ఉండాలి, తినేటప్పడు నిర్మలంగా ఉండాలి. లోకం గొడవలు చెప్పకోకుండా, పరమేశ్వరుని స్మరిస్తూ తింటే కొంతకాలానికి నీ బుద్ధి శుచి అవుతుంది.

చెట్టును కాయ ముగ్గింది అనుకోండి, నీవు దానిని రాయితో కొట్టనక్కరలేదు, ఎక్కి కోయనక్కరలేదు, అదే రాలిపోతుంది. మీరు సదాచారంగా ఉన్నారు అనుకోండి, మీ బుద్ధి పక్వానికి వచ్చింది అనుకోండి చెట్టు నుండి పండు రాలిపోయినట్లు మీ బుద్ధి పరమాత్మలో ఐక్యమవుతుంది. ఇది మద్వాచార్యులవారి సాంప్రదాయం. మీ ప్రారబ్దంలో మంచి ఉంటే మంచి, చెడ్డ ఉంటే చెడ్డ మీ దేహాన్ని అనుభవించనివ్వండి. మీకు సబ్జక్టు అర్థమవుతూ ఉంటే మీకు ఎక్కువ కష్టం లేకుండా మీలో ఉన్న అశాంతి నెమ్మదిగా నశిస్తుంది. మనం చేసే పని శ్రద్ధగా, ప్రేమగా, నిర్మలంగా చేస్తూ ఉంటే, అస్తమాను ఫలితం గురించి ఆలోచించకుండా ఉంటే మోక్షం దానంతట అదే వస్తుంది, దాని కోసం మీరు ఎదురుచూడనక్కరలేదు. గృహస్థు నేను గృహస్థుడను అనుకొంటాడు, సన్యాసి నేను సన్యాసిని అనుకొంటాడు. ఆ నేనులో నుండి బయటకు రానప్పడు, దాని తాలుక సాధన నీకు లేనప్పడు నీవు ఏ ఆశ్రమంలో ఉన్నా ఒక్కటే. మీరు చిన్న పనే చేయండి, పెద్ద పనులు అక్కరలేదు. మీరు శాంతంగా, నిర్మలంగా, దేహబుద్ధి తగ్గించుకొంటూ చేస్తే దేహంతో తాదాత్మ్యం పొందే మొదటితలంపు వేరుతో సహా నశిస్తుంది.

మన దగ్గర పది వంకాయలు ఉన్నాయి అనుకోండి, అందులో చెడ్డవి ఏరి ఇతరులకు ఇస్తాము. ఇవి అన్నీ మన జీవితంలో అందరికి అనుభవంలో ఉన్నవే. వారు వేరు, మనం వేరు అని అనుకోవటం వలన చెడ్డ వంకాయలు ఏరి ఇస్తాము, చివరకు భవిష్యత్‌లో ఆ చెడ్డ వంకాయలే మనకు మిగులుతాయి. ఇతరులకు ఏమి చేస్తే అదే నీకు తిరిగివస్తుంది అని నీకు అర్థమైతే ఇతరులకు మంచి చేయకుండా ఎలా ఉండగలవు అన్నారు భగవాన్. భగవంతుడు మీకు కేటాయించిన పనిలో నుండి పారిపోవటానికి ప్రయత్నం చేయవద్దు. ఆ పనిని హృదయపూర్వకంగా చేస్తే అది మనలను విడిచిపెట్టేస్తుంది. ఆ పనిని అయిష్టంగా, చిరాకుగా, కోపంగా చేస్తే అదే పనిని మరుజన్మలో భగవంతుడు మనకు కేటాయిస్తాడు.

పదిమందిలో కూర్చొన్నప్పుడు మొద్దుల్లాగ, శుద్దల్లాగ కూర్చోకుండా సందర్భాన్ని బట్టి మంచి చెప్పటం వలన మన డ్యూటీ మనం చేసాము అని సంతృప్తి ఉంటుంది. వారు ఆచరించటం, ఆచరించకపోవటం అనేది తరువాత విషయం. మనం జీవితంలో సంతృప్తి పడటం వలన రోజులు శాంతిగా వెళ్ళిపోతాయి. డబ్బు విలువ డబ్బుకు ఉంది, డబ్బు లేకపోతే రోజు వెళ్ళదు. అలాగని మనిషి పూర్తిగా డబ్బు మీద ఆధారపడితే, వాడికి సంతృప్తి లేకపోతే డబ్బు వలన వాడికి సంతోషం రాదు. మనిషికి డబ్బే ప్రధానం కాదు, మానసికశాంతి ఉండాలి లేకపోతే మనిషి బతకలేడు. నీ పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి నీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణం చెయ్యి, నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహాభిమానం తగ్గించుకొంటూ రావాలి. నీవు సాధన చేసేటప్పుడు నిర్మలంగా, నిశ్చలంగా చేయాలి, సాధన తాలుక ఫలితం కోసం ఎదురుచూడకూడదు. అది ఎప్పుడు రావాలో అప్పుడు వస్తుంది. మనం ప్రయాణం చేసేటప్పుడు స్టేషన్‌కు వెళతాము. మనం కంగారుపడితే రైలు వస్తుందా, అది ఎప్పుడు రావాలో అప్పుడే వస్తుంది. ఇంక మనం కంగారు పడటం వలన మోక్షం ఎలా వస్తుంది. ఏ పరిసరాలలో ఉన్నా, ఏ పరిస్థితులలో ఉన్నా ఎడ్జస్టు అయ్యి నీ సాధన నీవు చేసుకొంటూ ఉండు. ఎడ్జస్టుమెంట్ లేకపోతే రోజులు వెళ్ళవు. మీ ఇంట్లో వారి మాటలు కొన్ని మీరు వినాలి, మీ మాటలు వారు కొన్ని వినాలి. వారు చెప్పేది మీరు అర్థం చేసుకోవాలి, మీరు చెప్పేది వారు అర్థం చేసుకోవాలి. నీమీద నీకు విశ్వాసం లేకుండా, ధైర్యం లేకుండా నీకు ఆత్మజ్ఞానం రాదు.

ఎంత పెద్ద జంతువును అయినా సుడిగుండం ఎలా తిప్పుతుందో అలా నీ ప్రారబ్దం సరిగాలేనప్పుడు ప్రారబ్దం మనస్సును అలా తిప్పుతుంది. అప్పుడు గురువు సహాయం ఉండాలి, మన మీద మనకు విశ్వాసం ఉండాలి, సత్సంగబలం ఉండాలి ఇన్ని ఉంటేగాని ఆ సుడిగుండంలో నుండి బయటకు రాలేరు. నేను అనే తలంపు లేకుండా పనిచేస్తూ ఉంటే శారీరకంగా,

మానసికంగా టైర్ అవ్వవు. నేను అనే తలంపు ఎప్పుడైతే విజృంభిస్తుందో చూసి అప్పుడు నీ పాదాన్ని దాని మీద పెట్టి కిందకు గెంటివేస్తూ ఉండు. ఈ సృష్టి అనేది పెద్ద ప్రణాళిక. ఈశ్వరుడికి తెలియకుండా ఈ సృష్టిలో ఏదీ జరగటానికి వీలులేదు. ఈ మహాప్రణాళికలో, పెద్దమిషన్‌లో ఎక్కడో చిన్ననట్టుగా మనలను పెట్టాడు. ఆ నట్టు చేసే పని కూడా ఉంటుంది. భగవంతుడు మనకు కేటాయించిన పనిని ఇష్టంగా, ప్రేమగా, శాంతిగా చేయటం వలన మన బుద్ధిలో ఏమైనా దోషాలు ఉంటే అవి పోతాయి, కొత్తగా దోషాలు రావు. రోడ్డు మీద ఉన్న దుమ్ము అంతా పోగుచేసుకోవద్దు. ఎలా పని చేస్తే మనస్సు అణుగుతుందో ఆ సీక్రెట్ తెలుసుకొని పనిచేస్తే మనస్సు అణిగిపోతుంది. దైనందిన జీవితంలో పనిదొంగలు అవ్వవద్దు. మీ పని మీరు శాంతిగా చేసుకోండి. మిగతా సమయంలో ధ్యానం, అధ్యయనం చేసుకోండి. మీకు కోరికలు నెరవేరినప్పడు శాంతిగా, సంతోషంగా ఉండవచ్చు, అది గంట ఉండవచ్చు, పది రోజులు ఉండవచ్చు. కాని గురువు అనుగ్రహం వలన వచ్చే శాంతి అటువంటిది అనుకోవద్దు. అది లోకానికి సంబంధించినది కాదు, అది మన ఊహలకు అందదు. మీ ఇంటిలో ఉన్న డబ్బు, మీ గాదిలో ఉన్న ధాన్యమే లక్ష్మి అనుకోవద్దు. మీ ఇంటిలోనివారు సహృదయం, సద్బుద్ధి ఉన్నవారు అనుకోండి, మంచితనం ఉన్నవారు అనుకోండి, అది కూడా లక్ష్మే. మీ మనస్సు శాంతిగా ఉంటే అది లక్ష్మీదేవి అనుగ్రహమే.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 08-07-07, చింతపర్రు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

చింతపర్రు గ్రామంలో ఈ మధ్యకాలంలో షిరిడీబాబా ఆలయం నిర్మించారు. ఆలయాలు నిర్మించినప్పడు అక్కడ నియమించిన అర్చకులు ఎంత శ్రద్ధగా పూజలు చేస్తే అక్కడికి అంతమంది భక్తులు వస్తారు, గుడికి ఆకర్షణ కలుగుతుంది. అలా శ్రద్ధగా, మంత్ర లోపం లేకుండా పూజలు చేస్తే భక్తులు, అర్చకులు బాబా అనుగ్రహానికి పాత్రులవుతారు. ఆలయాన్ని గ్రామస్థులు జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. మీకు ఏవైనా కోరికలు ఉంటే ఆయనను అడగవచ్చు, ఆయన ఇవ్వవచ్చు కాని ఇవి అన్నీ భౌతికమైనవి అయినప్పటికీ ఈ నెరవేరిన కోరికలు అంతిమ లక్ష్యమైన మోక్షం వైపుకు నీ మనస్సును తిప్పవచ్చు. మనందరకు గురువులు ఉండవచ్చు, వారికి గురువులు ఉండవచ్చు, ఎంతమంది గురువులు ఉన్నా ఆది గురువు, మూల గురువు వ్యాసమహర్షి. అందుచేత ఆయన పుట్టిన రోజును గురుపూర్ణిమగా మన పెద్దలు ఏర్పాటు చేసారు. గురువు అంటే చీకటిని పోగొట్టేవాడు అని అర్థం. సూర్యుడు బాహ్యమైన చీకటిని ఎలా పోగొడుతున్నాడో అలాగే గురువు మనలో ఉన్న అజ్ఞానమనే చీకటిని పోగొట్టి

లోపలఉన్న సద్వస్తువును అనుభవైకవేద్యం చేస్తాడు, వాడు గురువు. ఇతరులకు మంచి చేస్తే నీకు పుణ్యం వస్తుంది, ఇతరులను పీడిస్తే, నీకు పాపం వస్తుంది, ఇది పురాణాల సారాంశం అని వ్యాసుడు చెప్పాడు. మనకు పుణ్యబలం ఉంటే ఆత్మజ్ఞానం సంపాదించాలనే కోరిక కలుగుతుంది. ఇతరులకు సహాయ సహకారములు అందరూ చేయలేరు, అలా చేయటానికి మనస్సును ప్రిపేర్ చేయాలి. మన చదువుకు, ఆత్మజ్ఞానానికి ఏమీ సంబంధం లేదు. వాడు పరమపవిత్రుడు అయితే చదువులేనివాడికి కూడా ఆత్మజ్ఞానం కలుగుతుంది. చదువు లేనివాడిలోను, చదువు ఉన్నవాడిలోను కూడా మూర్ఖత్వం ఉంటుంది. వారు సాధన చేసి ఆ మూర్ఖత్వాన్ని తొలగించుకోవాలి కాని స్కూలులో కాలేజీలలో చదివే చదువుల వలన ఆ మూర్ఖత్వం పోదు. ఆ మూర్ఖత్వంలో నుండి మనలను బయటకు తీసుకొని వచ్చేవాడే సద్గురువు.

మీ దగ్గరకు చాలామంది వచ్చి దర్శనం చేసుకొని వెళుతున్నారు, వీరందరికి మోక్షం వస్తుందా అని బాబాగారిని అడిగారు. ఆయన ఎదురుగా ఉన్న మామిడిచెట్టును చూపించి దానికి ఎన్ని పిందెలు ఉన్నాయో చూడండి. అవి అన్నీ పండ్లు అవుతాయా, అవ్వవు. ఏ పిందెలు అయితే రాలకుండా చెట్టును అంటిపెట్టుకొని ఉంటాయో అవి మాత్రమే పండ్లు అవుతాయి. మధ్యలో రాలిపోయినవి పండ్లు అవ్వవు. అలాగే ప్రాణం పోయేవరకు ఎవడైతే గురువును అంటిపెట్టుకొని ఉంటాడో వాడికి మాత్రమే జ్ఞానం కలుగుతుంది లేకపోతే కలుగదు అని చెప్పారు. కోతులు చెట్ల మీదకు ఉరికినప్పుడు, పెద్ద గాలులు వీచినప్పుడు కొన్ని పిందెలు రాలిపోతాయి అలాగే కొంతమంది చెడు స్నేహాల వలన గురువును వదిలేస్తారు. చెడుస్నేహాల వలన గురువు మీద భక్తి, ప్రేమ తగ్గిపోయింది అనుకోండి ఇంక మీకు మోక్షం కలుగదు, మధ్యలో రాలిపోయిన పిందెలు కుళ్ళిపోయినట్లు మీరు కూడా పాడైపోతారు. మనకు శరీరం సహకారం, ఇంద్రియాల సహకారం, మనస్సు సహకారం ఉండాలి. నోటితో మంచిమాటలు ఉచ్చారణ చేయాలి గాని చెడుమాటలు ఉచ్ఛారణ చేయకూడదు. చెవులతో మంచిమాటలు వినాలిగాని చెడుమాటలు వినకూడదు. కళ్ళతో మంచిదృశ్యాలు చూడాలిగాని చెడుదృశ్యాలు చూడకూడదు. మంచితలంపులు, మంచిఆలోచనలు వచ్చేటట్లు నన్ను అనుగ్రహించు, నాకు ఏదైనా తెలివి ఉన్నా అది నీ పాదాల యందు భక్తి కలగటానికి ఉపయోగపడేలా నన్ను అనుగ్రహించు అని భగవంతుడిని ప్రార్థించాలి, మనం సిమ్మెంట్ పని చేయాలంటే కొంత ట్రైనింగ్ అవ్వాలి, వడ్రంగి పని చేయాలంటే కొంత ట్రైనింగ్ అవ్వాలి అలాగే లోపల ఉన్న పరమాత్మ జ్ఞానం సంపాదించటానికి మన శరీరాన్ని, ఇంద్రియాలను, మనస్సును పరిశుద్ధం చేసేదే యోగా. యోగా అంటే ఏవో ఆసనాలు వేయటంకాదు, లోపల ఉన్న గురువును అందుకోవటానికి మనస్సును ప్రిపేర్ చేసే

దానిని యోగా అని పిలుస్తారు. ఎక్కడో రాళ్ళు కడిగి వచ్చాము, అభిషేకం చేసి వచ్చాము అంటే మీరు బాగుపడరు, మూడు విషయాలలో మీరు జాగ్రత్తగా ఉండాలి. మీకు వచ్చే ఆలోచనల విషయంలో, చేసే పనుల విషయంలో, మాట్లాడే మాటల విషయంలో జాగ్రత్తగా ఉండండి. అలా ఉంటే మీరు పవిత్రులు అవుతారు. పవిత్రులయితే నిర్వాణసుఖం అందుతుంది. పవిత్రులు కానివారికి నిర్వాణసుఖం దొరకదు అని బుద్ధుడు చెప్పాడు. నీవు చేసే పని ముఖ్యం కాదు, అక్కడ ఏ భావనతో చేస్తున్నావు అనేది భగవంతుడు చూస్తాడు. నీవు మంచి పని చేస్తున్నా కూడా అది నీవు ఏమైనా ఆశించి చేస్తున్నావా, వారు బాగు పడాలని చేస్తున్నావా, లోపల నీకు ప్రేమభావన ఉందా అనేది భగవంతుడు చూస్తాడు. లోపల అంతర్యామిగా ఉన్న భగవంతుడిని మనం మోసం చేయలేము. వాడు కాళ్ళు లేకుండా నడవగలడు, చేతులు లేకుండా పని చేయగలడు, కళ్ళు లేకుండా చూడగలడు, వాడికి ఇంద్రియాలతో పనిలేదు, వాడు అశరీరుడు.

ఏ పని ఎప్పుడు ఎలా జరగాలో అలా జరుగుతుంది, నీవు కంగారు పడకూడదు. ఆ కాలం వచ్చినప్పుడు మీ సంకల్పంతో సంబంధం లేకుండా ఆ పని అయిపోతుంది. గాఢనిద్ర మనకు పెద్ద గురువు అన్నారు భగవాన్. గాఢనిద్రలో నీకు శరీరం గొడవ లేదు, ఇంద్రియాల గొడవ లేదు, మనస్సు లేదు, లోకం గొడవలు ఏమీ అక్కడ లేవు, స్త్రీ పురుష బేధం లేదు, చావు పుట్టుకల గొడవ లేదు. ఈ గొడవలు ఏమీ లేకుండా నీవు అక్కడ సుఖంగా ఉన్నావా, లేదా? నీవు సుఖంగానే ఉన్నావు. మరి జాగ్రదవస్థలోనికి వచ్చాక మనస్సు వస్తోంది, మనస్సు వచ్చాక మనస్సు కల్పించిన గొడవలు అన్నీ వస్తున్నాయి. మనస్సు ఎంత నిజమో అది కల్పించిన గొడవలు కూడా అంతే నిజం. గాఢనిద్రలో నీవు ఏ గొడవ లేకుండా సుఖంగా ఉన్నావు, గాఢనిద్రలో ఎలా సుఖంగా ఉన్నావో ఇప్పుడు జాగ్రదవస్థలో మనస్సు కల్పించిన గొడవల మధ్యన నీవు అలా ఉండ గలిగితే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. రాబోయేజన్మ ఎలాంటిది వస్తుంది అని భగవాన్‌ను అడిగితే ఈ జన్మే అబద్ధం అంటే రాబోయే జన్మ గురించి అడుగుతావు ఏమిటి అనేవారు. ఒకవేళ రాబోయే జన్మ ఉన్నా ఒక అబద్ధంలో నుండి ఇంకో అబద్ధంలోనికి వెళ్ళటం అన్నారు. గాఢనిద్రలో నీవు పొందే సుఖం ఎక్కడ నుండి వస్తోంది? అది నీ హృదయంలో నుండే వస్తోంది. అది ఒక్కటి మాత్రమే నిజమైన సుఖం, స్వతంత్రమైన సుఖం. అది కాకుండా నీ మనస్సు కల్పించిన గొడవలలో నుండి పొందే సుఖం అంతా భవిష్యత్‌లో దుఃఖంగా మారిపోతుంది ఎందుచేతనంటే అది నిజం కాదు. భగవంతుడు మీ డబ్బును, గౌరవాన్ని చూడడు. నీవు చేసే పనిలో, నీవు మాట్లాడే మాటలో ప్రేమ ఉందా అని చూస్తాడు. ప్రేమ లేకపోతే కొబ్బరికాయలలో పాడైన వాటిని తీసివేత కాయలుగా తీసేస్తారు అలాగ నిన్ను కూడా

తీసేస్తాడు. మనం ఎందుకు పాడైపోతున్నాము అంటే మన పాడుబుద్ధితో భగవంతుడిని కొలుస్తున్నాము. రాముడు దేవుడు కదా అలా చేసాడు ఏమిటి అంటాము. ఎవడి అనుగ్రహం వలన మనకు భక్తి కలుగుతోందో, జ్ఞానం కలుగుతోందో వాడికి రాగద్వేషములు ఎలా ఉంటాయి. అది తెలియక రాముడికి, కృష్ణుడికి రాగద్వేషాలు ఉన్నాయి అని వారిని మన పాడుబుద్ధితో కొలుస్తాము. నీవు ప్రయత్నం చేసి దేవతాపురుషుల అనుగ్రహం పొందితే మంచిదే కాని ఆ దేవతా పురుషులను కొలచి నీకంటే తక్కువ వారు అనుకొంటున్నావు. ఈ కొలతలే నీ అశాంతికి కారణం. మనకంటే ఎక్కువ డబ్బు ఉన్నవారితో, ఎక్కువ పొలం ఉన్నవారితో పోల్చుకోవటం, అశాంతి తెచ్చుకోవటం. భగవంతుడు చెప్పిన మాటలను మన ఇరుకు మనస్సుతో చూడకూడదు. మన ఇరుకు మనస్సుకు ఆ మాటలు అర్థం కావు.

మనం కర్మ అనుభవించటానికి వచ్చాము, గురువులు కారణజన్మలు ఏదో కారణం నిమిత్తం మనలను ఉద్ధరించటానికి వస్తారు. సజ్జనసాంగత్యం వలన మనలో ఉన్న తెలివితేటలు పెరుగుతాయి, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. దుష్టసాంగత్యం వలన తెలివితేటలు తగ్గిపోతాయి, జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. స్నేహాల విషయంలో, చదివే పుస్తకాల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. సజ్జనసాంగత్యం వలన మనకు జ్ఞానం పట్ల ప్రీతి కలుగుతుంది, విషయచింతన తగ్గిపోతుంది, దైవచింతన పెరుగుతుంది. దైవచింతన లేకుండా మనం దేవుని స్వరూపాన్ని పొందలేము. సజ్జనసాంగత్యం వలన నీలో ఉన్న చెడుసంస్కారాలు, అలవాట్లు అన్నీ కాలిబూడిద అయిపోతాయి. వాతావరణంలో కాలుష్యం ఉందనుకోండి దాని వలన నీశరీరం అనారోగ్యానికి గురి అవుతుంది. చెడుస్నేహాల వలన నీ మనస్సులో కాలుష్యం వచ్చి ఆ రోజుకారోజు నీవు పతనమవుతావు. వాతావరణంలో ఉన్న కాలుష్యం కంటే నీ మనస్సులో వచ్చే కాలుష్యం చాలా ప్రమాదం, అది జన్మ జన్మలకు నిన్ను పీడిస్తుంది. పాము నోటిలో ఉన్న విషం పామును ఏమీ చేయదు అలాగే రాముడిలో ఉన్న గుణాలు, కృష్ణుడిలో ఉన్న గుణాలు వారిని ఏమీ అంటవు. పరమాత్మలోని గుణాలు పరమాత్మను ఏమీ అంటవు. నీవు ఎన్ని శాస్త్రములు చదివినా, ఎన్ని ప్రసంగాలు విన్నా, ఎన్ని మంచిపనులు చేసినా ఒక మహాజ్ఞాని, ఒక మహాగురువు వలన వచ్చే సహాయసహకారములతో అవి సమానం కాదు. మంచి పనులు చేయటం వలన మన బుద్ధి శుద్ధి అవుతుంది. బుద్ధి శుద్ధి అవ్వటం వలన జ్ఞానం పట్ల దానికి అపేక్ష కలుగుతుంది, బుద్ధి శుద్ధి అవ్వటం వలన ఆత్మజ్ఞానసముపార్జన చేయాలనే సంకల్పం నీ హృదయంలో కలుగుతుంది.

మనం సమాజానికి ఋణపడి ఉన్నాము. ఏ సమాజం వలన మనం అభివృద్ధిలోనికి వచ్చామో దాని ఋణం తీర్చుకోవటం మంచిది, దానివలన భగవంతుని యొక్క దయకు

పాత్రులవుతాము. ఆయన అనుగ్రహం లేకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. మనకు ఉన్న కొద్దిపాటి తెలివిని, వివేకాన్ని, విచక్షణను వీటి అన్నింటిని ఈశ్వరునిపాదాల పట్ల భక్తి పెరగటానికి ఉపయోగించుకోవాలి. మనకు సహృదయం ఉన్న వాడితో స్నేహం చేయాలనిపించదు పైగా వాడిని ద్వేషించాలనిపిస్తుంది. దానికి మనలో ఉన్న పాపం కారణం. మీకు జీవితంలో కష్టాలు రావచ్చు. మీకు నేర్చుకొనే శక్తి ఉంటే ఆ కష్టాలు మీకు పాఠాలు నేర్పుతాయి. మనం ఈ జీవితంలో ఏ పాఠాలు నేర్చుకొన్నాము అని ప్రతీవాడు జాగ్రత్తగా చూసుకోవాలి. ఒకోసారి మీకు వచ్చే ప్రతీ తలంపు మిమ్మల్ని బాధపెడుతుంది. ఇటువంటి తలంపులు వస్తున్నాయి ఏమిటి అని మీకు అనిపిస్తుంది. మనస్సు నేను అనుకోవటం వలన, దేహం నేను అనుకోవటం వలన ఇవి అన్నీ వస్తున్నాయి. ఇవి అన్నీ అబద్ధంలోనుండి వస్తున్నాయి. అబద్ధంలో నుండి వచ్చే తలంపులు మిమ్మల్ని ఎలా సుఖపెడతాయి. ఇవి అన్నీ అబద్ధంలో నుండి వస్తున్నాయి అని నీ గుండెకు తాకితే, ఆ గ్రహింపు వస్తే ఆ తలంపులు అన్నీ పోతాయి. మనస్సుతోటి, దేహంతోటి జత తగ్గించుకొంటే మనకు అశాంతిని తీసుకొని వచ్చే తలంపులు అన్నీ తగ్గిపోతాయి. ఎక్కడైతే ఆత్మజ్ఞానం కలిగిందో అక్కడ శాంతి ఉంటుంది, శక్తి ఉంటుంది. మనకు ఏది అవసరమో భగవంతుడికి తెలియదు అనుకొని కోరికలు కోరతాము. మనం కోరితేనేగాని భగవంతుడు ఇవ్వడు అనుకొంటాము. మనకు ఏది అవసరమో మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు, ఏది ఎప్పుడు ఇవ్వాలో ఆయనే ఇస్తాడు అందువలన కోరికలు ఏమీ అక్కరలేదు. జ్ఞాని, భగవంతుడు ఏదో అవసరం ఉండి మనలను ప్రేమించడు, ప్రేమించకుండా ఉండలేడు కాబట్టి ప్రేమిస్తాడు, వాడి స్వరూపమే ప్రేమ, అది అకారణ ప్రేమ.

దేహప్రారబ్దంలో ఉన్నది నీ కోరికతో సంబంధం లేకుండా వస్తుంది, దేహప్రారబ్దంలో లేనిది నీవు కోరుకొన్నా రాదు. మీకు నేను పది మంచిమాటలు చెపుతాను అనుకోండి, ఎవడో వచ్చి ఒక చెడ్డమాట చెప్పాడు అనుకోండి. ఈ పది మంచిమాటలు వదిలేసి ఆ చెడ్డ మాటను పట్టుకొంటారు ఎందుచేతనంటే మన బుద్ధి మంచిది కాదు. ఉన్నది ఏదో ఉంది, లేనిది ఏదో లేదు అని పరమాత్మ చెప్పాడు. ఉన్నది పాజిటివ్, లేనిది నెగిటివ్. నెగిటివ్‌ను పట్టుకొని పాజిటివ్‌ను పొందాలి అనుకొంటున్నాము, ఎలా పొందుతారు? కంచంలో అన్నం అలాగే ఉండాలి, పిల్లలు బొండాలులాగ ఉండాలి అంటే అది ఎలా సాధ్యం? కలకత్తా వెళ్ళే రైలు ఎక్కి మద్రాసు వెళ్ళాలి అంటే ఎలా సాధ్యం? ఏదైతే ఉందని భగవంతుడు చెపుతున్నాడో దానిని పట్టుకొంటే దానిని పొందుతావు. లేనిది పట్టుకొంటే ఉన్నది ఎలా దొరుకుతుంది, చివరకు మనకు మిగిలేది బూడిద. రాగద్వేషములు తగ్గించుకో. భయం తగ్గించుకో. భయం వలన

శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం చెడిపోతుంది. కోపం వలన మనకు చాలామంది శత్రువులు అవుతారు, మనం ఇతరులకు ఏదైనా చెప్పేటప్పుడు కోపంగా చెప్పకూడదు, శాంతిగా చెప్పాలి. మనం ఏదో చెపుతున్నాము, వాడు నేర్చుకొంటున్నాడు అనే బేదబుద్ధితో చెప్పకూడదు. నీకు చలివేస్తూ ఉంటే నిప్ప దగ్గర కూర్చోవాలి గాని చెరువులో పడితే ఎలాగ? ఇంకా చలి పెరిగిపోతుంది. నీకు జ్ఞానం కావాలంటే ఆత్మజ్ఞానిని ఆశ్రయించు అంతేగాని అజ్ఞాని దగ్గరకు వెళతానంటావేమిటి? నిప్ప దగ్గరకు వెళితే చలి నెమ్మదిగా తగ్గిపోతుంది. అలాగే జ్ఞానం పొందిన వాడిని సమీపిస్తే జ్ఞానం పొందాలి అనే కాంక్ష దానంతట అదే ఉదయిస్తుంది, ఉదయించటమే కాదు జ్ఞాని యొక్క అనుగ్రహం వలన ఆత్మజ్ఞానం పొందుతావు, నీ కోరిక నీకు తెలియకుండానే తీరుతుంది. పూర్వజన్మ పాపకర్మ ఎక్కువగా ఉంటే అసలు మనలను మంచి కంపెనీలోనికి వెళ్ళనివ్వదు. మన బుద్ధి పాడుబుద్ధి. చెట్టుకు నీరు పోయకూడదు, చెట్టు పెద్దది అవ్వటానికి శ్రద్ధ చేయకూడదు. కాని ఆ చెట్టు కాయలు కాస్తేమటుకు మొత్తం మనమే తినేయాలి. కష్టపడి పెంచిన వాడిని కూడా గెంటేసి మొత్తం పండ్లు మనమే తినేయాలి అనుకొంటాము. ప్రస్తుతం మన పరిస్థితి ఇలా ఉంది. గురువు, ఈశ్వరుడు అంతటా ఉన్నాడు, అంతర్యామిగా ఉన్నాడు. ఆయన ఏ స్థాయిలో ఉన్నాడో ఆ స్థాయిని పొందింపచేయటానికి మనలను ప్రిపేర్ చేస్తున్నాడు. దేహంతో, మనస్సుతో స్నేహం తగ్గించుకొంటే అంతర్యామిగా ఉన్న నారాయణుడు మీకు వ్యక్తమవుతాడు. వారికి ఉపకారం చేసాము, వీరికి ఉపకారం చేసాము అంటారు. ఆ చేసేది అంతా తిరిగి మనకే వస్తుంది అని తెలియక అలా అనుకొంటున్నారు. దేవుడు ఉన్నాడా లేడా అనే గొడవ ప్రక్కన పెట్టు. మనకు ఇంత వయస్సు వచ్చింది, మన జీవితంలో కనీసం ఒక్కరి క్షేమం అయినా మనం కోరామా? మనస్సులో ఎప్పుడైనా వారు బాగుపడాలి అని అనుకొన్నావా? ఏమీ లేదు ఇంక నీకు జ్ఞానం ఏమిటి?

మీకు తలంపులు వస్తున్నాయి. కంగారుపడకండి. ఆ తలంపులకు దేహం కారణమా, మనస్సు కారణమా అని చూసుకోండి. ఈ రెండు మనం కాదు, అది మీకు అర్థమైతే తలంపులు తగ్గిపోతాయి. దేహం పీడ, మనస్సు పీడ వదిలించుకొంటే అంతర్యామిగా ఉన్న పరమాత్మ మీకు వ్యక్తమవుతాడు. భూమిలో నీళ్ళు ఉన్నాయి. అక్కడ తవ్వితే మనకు కనిపిస్తాయి, తవ్వకపోతే అక్కడ నీరు ఉన్నా కనబడదు. అంతటా నారాయణుడు ఉన్నాడు, అనుగ్రహం అంతటా ఉంది. కొంచెం ప్రయత్నం చేస్తే, వివేకం పెంచుకొంటే, వైరాగ్యం పెంచుకొంటే లోపల ఉన్న వస్తువు మనకు వ్యక్తమవుతుంది, అయితే ప్రయత్నం సిన్సియర్‌గా చేయాలి. బంధువులతోటి, శత్రువులతోటి, మిత్రులతోటి, ఆస్తులతోటి అందరితో సంబంధం తెగిపోతుంది కాని మనకు

గురువుతో ఉన్న సంబంధం తెగదు. ఆయన ఏ స్థాయిలో అయితే ఉన్నాడో ఆ స్థాయిని మనం పొందే వరకు ఆయన మనలను విడిచిపెట్టడు, వాడు గురువు. చంటి పిల్లలు తల్లులను తన్నుతూ ఉంటారు. వారు తన్నుతున్నారని వారిని నేలకేసి కొట్టదు. అలాగే మనం గురువును విడిచిపెట్టినా, గురువును దూషించినా కూడా మనలను ఉద్ధరించే వరకూ గురువు మనలను విడిచిపెట్టడు. ఇప్పడు మనం ద్వైతం మధ్యలో ఉన్నాము. గాఢనిద్రలో ద్వైతం లేదు. అక్కడ సుఖంగా ఉన్నాము. ద్వైతం మధ్యలో ఉండి మనం అద్వైతానుభవం పొందాలి. అది మనోనాశనం కలిగినప్పడు సాధ్యమవుతుంది. జాగ్రత్‌లో సుషిప్తి రావాలి, అప్పడు బ్రాహ్మీస్థితిని పొందుతావు. నదులు వెళ్ళి సముద్రంలో కలుస్తున్నాయి అనుకో, సముద్రం ఏమీ పెరగదు. నదులకు కోపం వచ్చి సముద్రంలో కలవటం మానివేసినా సముద్రం ఏమీ తగ్గిపోదు, అది సమానంగానే ఉంటుంది. అలాగే బ్రాహ్మీస్థితిని పొందినవాడికి కోరికలు నెరవేరినా, నెరవేరకపోయినా వాడికి ఏమీ వికారం కలుగదు, వాడు సమానంగా ఉంటాడు. వాడు శాంతి సముద్రుడు. మీ ఇంట్లో వారు ఎవరూ మీతో మాట్లాడరు అనుకోండి మీకు కంగారు వచ్చేస్తుంది, అది ఎటాచ్‌మెంట్ వలన వస్తుంది. అహంకారానికి ఇతరులు ఉన్నారు, ఆత్మకు ఇతరులు లేరు, అంతా తానే. సర్వ జీవుల పట్ల వైరం పెట్టుకోవద్దు అని భగవంతుడు చెప్పాడు. ఎందుచేతనంటే వైరం పెట్టుకోకపోతే మీ మనస్సుకు లోచూపు కలుగుతుంది. వైరం పెట్టుకోవటం వలన మనస్సుకు బాహ్య దృష్టి పెరిగిపోతుంది. ఒక మంచిమాటను తిరిగి చెప్పటం వలన అది మాట అవ్వదు, మంత్రం అవుతుంది. అది మీకు తెలియకపోవటం వలన అది చాదస్తం, అది చెడ్డ అలవాటు అని మీరు అనుకొంటున్నారు. ఒక మంచి మాటను రిపీట్ చేస్తున్నాము అనుకోండి, అది మంత్రం అవుతుంది, అది చాదస్తం అనుకోవద్దు. ఎవరైనా కొత్తగా భగవాన్ దగ్గరకు వస్తే అక్కడ ఉన్నవారు వీరు కొత్తగా కనిపిస్తున్నారు, వీరు ఎవరు అని అంటే ఎవరో అయితే మన దగ్గరకు ఎందుకు వస్తారు, వారు మనవాళ్ళు కాబట్టే మన దగ్గరకు వచ్చారు అనేవారు భగవాన్.

మీరు వందకోట్లు పెట్టి మేడలు కట్టుకొన్నా, గొప్ప కీర్తి సంపాదించినా మీ స్వభావం మారదు అనుకోండి మీకు జ్ఞానం రాదు. మన స్వభావం మార్చుకొందాము అనుకొన్నా అది మారదు. దానికోసం మనం ప్రయత్నం చేయాలి, కాలం కలసిరావాలి, ఈశ్వరానుగ్రహం ఉండాలి. ఇన్ని కలిసివస్తేనేగాని మన స్వభావాన్ని మార్చుకోలేము. చనిపోయిన గురువు, బతికిఉన్న గురువు అని ఏమీ ఉండదు, గురువు అంటే ఆత్మ, చైతన్యం. అది ఎప్పడూ ఉంటుంది. అది లేని క్షణం అంటూ ఉండదు, అది లేని ప్లేసు అంటూ ఉండదు. శరీరం ఎక్కడ ఉంది అనేది ప్రధానం కాదు. శరీరం ఎక్కడ ఉన్నా ఈశ్వరుడితో, గురువుతో మానసిక

అనుబంధం ముఖ్యం. శరీరం పుడుతుంది, పెరుగుతుంది, ముసలిది అవుతుంది, నశిస్తుంది. శరీరంలో మార్పులు రావటం ఎంత సహజమో, శరీరం మరణించిన తరువాత జీవుడికి ఇంకో శరీరం రావటం కూడా అంతే సహజం. శరీరయాత్ర స్మశానంతో ఆగిపోతుంది. జీవలక్షణాలు ఉన్నంతసేపు జీవుడి యాత్ర సాగుతూ ఉంటుంది, ఈ శరీరం మరణించినా జీవలక్షణాలు ఉన్నాయి కాబట్టి ఇంకో శరీరం వస్తుంది. జీవ లక్షణాలు నశించే వరకు శరీరాలు మోస్తూ ఉండవలసిందే. జీవలక్షణాలు నశిస్తే వాడు ఈశ్వరస్వరూపాన్ని పొందు తాడు. అదే మోక్షం. ప్రతీవాడు మోక్షాన్ని నోటితో కోరుకొంటాడు, హృదయంలో పునర్జన్మలు కోరుకొంటాడు. అలా ఎందుకు కోరుకొంటున్నాడు అంటే ఈ శరీరము తాను అనుకోవటం వలన, శరీరం లేకపోతే ఉండమని అనుకోవటం వలన అందరూ మోక్షాన్ని కోరుకోవటం లేదు, పునర్జన్మలను కోరుకొంటున్నారు. అంటే ఒక అబద్ధంలో నుండి ఇంకో అబద్ధంలోనికి వెళ్ళటం, ఒక జైలులో నుండి ఇంకో జైలులోనికి వెళ్ళటం. ఉన్నది ఏదో ఉంది, లేనిది ఏదో లేదు. ఉన్న దానిని మీరు లేదు, లేదు అని అనుకొన్నా అది ఉండకుండా పోదు, లేనిదానిని మీరు ఉంది, ఉంది అని అనుకొన్నా అది ఉండదు. ఉన్నది పాజిటివ్, లేనిది నెగిటివ్. ఉన్న దానిని మీరు పట్టుకొంటే దానిని మీరు పొందుతారు. లేనిదానిని పట్టుకోవటం వలన ఉన్నదానిని మీరు పొందలేరు, దైనందినజీవితంలో మీ ఆలోచనలో, మాటలో, చేతలో, మీ హృదయంలో పాజిటివ్‌గా ఉండండి, అలా ఉంటే ఉన్నదానిని మీరు పొందుతారు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 17-06-07, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మా మనస్సు కుదురుగా ఉండటంలేదు, శాంతిగా ఉండటం లేదు అని చాలామంది అడుగుతున్నారు. మనలో ఉన్న పెద్ద లోపం ఏమిటి అంటే ఈశ్వరుడిపట్ల మనకు ఉండవలసి నంత భక్తి లేదు. మేము భక్తులం అనుకొనేవారికి కూడా ఉండవలసినంత భక్తి లేదు, నిజంగా తెలియకవారు అలా అనుకొంటున్నారు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం కూడా మనకు లేదు. చాలామంది మనుషులు విశ్వాస హీనులే. భాగవతంలో ఒక మాట ఉంది. పరమాత్మ పాదాలయందు మీకు భక్తి లేకపోతే మీకు ఇంటి నిండా డబ్బు ఉన్నా, బంగారం ఉన్నా మీకు శాంతి కలుగదు అని చెప్పాడు. మీరు డబ్బు ఉంటే ఖరీదైన బట్టలు కట్టుకోండి, సెంటులు రాసుకోండి వాటివలన మీ ఆకలి తీరుతుందా అని వ్యాసుడు అన్నాడు. అన్నం తిన్నవాడికి ఆకలి తీరుతుంది గాని సెంటులు రాసుకున్నా, బంగారపు ఊయలలో కూర్చొన్నా మీ ఆకలి తీరదు. అలాగే భగవంతుడి పాదాలయందు భక్తి ఉంటే, ప్రేమ ఉంటే నీకు అశాంతి

తగ్గుతుంది కాని లేకపోతే అశాంతి పోదు అని చెప్పాడు. భగవంతుని యందు భక్తి ఉంటే, ప్రేమ ఉంటే నీకు అశాంతి తగ్గుతుంది కాని లేకపోతే అశాంతి పోదు అని చెప్పాడు. భగవంతుని యందు భక్తి పెరుగుతూ ఉంటే, ఆయనపట్ల విశ్వాసం కుదిరితే మీకు విసుగు తగ్గుతుంది, సహనం పెరుగుతుంది. ఈశ్వరుని పట్ల గౌరవం కలిగి ఉంటే నీ బుద్ధిలో ఎన్ని దోషాలు ఉన్నా అవి బయటకు పోతాయి, అప్పుడు దేవుని అనుగ్రహానికి పాత్రులం అవుతాము. నీకున్న భక్తి నిజమైతే ముక్తిని అడగదే అన్నాడు వ్యాసుడు. నిజమైన భక్తుడు దేనికోసం ఎదురుచూడడు, వస్తే అంగీకరిస్తాడు, నాకు భక్తే చాలు అంటాడు. భగవంతుని చింతించకుండా, ఆయన కళ్యాణ గుణాలను తలపెట్టుకోకుండా, ఆయన రూపాన్ని ధ్యానించకుండా ఏమీ లేకుండా మనస్సుకు శాంతి లేదు, శాంతి లేదు అనుకొంటున్నారు. ఈశ్వరునిపట్ల విశ్వాసం ఉంటే, భక్తి ఉంటే మీ బుద్ధిలో ఉన్న లోపాలు అన్నీ పోతాయి, నీవు పొరపాట్లు చేసినా వాటిని సరిచేసి నిన్ను అనుగ్రహిస్తాడు. వాడు దేవుడు. మీ మతంలో దేవుళ్ళు ఎక్కువ అని ఇతర మతస్థులు అంటారు. పరమాత్మ ఒక్కడే, ఆయనే అనేక రూపాలలో ఉన్నాడు, ఏ రూపాన్ని ఆరాధించినా అనుగ్రహించేవాడు ఆయనే. ఆయనే అంతటా వ్యాపించి ఉన్నాడు, మన అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాడు, మన దేహప్రారబ్ధాన్ని బట్టి ఆడిస్తున్నాడు. మీకు లోచూపు లేకపోవటం వలన అంతర్యామిగా పరమాత్మ ఉన్నా ఆయన యొక్క వైభవం మీకు తెలియటం లేదు. దేహము నేను అనే బుద్ధి వలన దేవుడు ఎక్కడో ఉన్నాడని మనకు అనిపిస్తుంది.

మనకు అదృష్టం వెంటాడుతూ ఉంటే సంతోషిస్తాము, దురదృష్టం వెంటాడుతూ ఉంటే ఏడుస్తాము. దురదృష్టం వచ్చినప్పుడు ఎవరైనా ఏడుస్తూ ఉంటే బాగా ఏడుస్తున్నారు అని అనుకొంటూ వారి దుఃఖం మీ సంతోషానికి కారణం అయితే మనం భక్తులమా, రాక్షసులమా? రాక్షసులు ఇతరులను పీడించి వారు సంతోషిస్తారు. వ్యాసుడు ఇంకోమాట చెప్పాడు. మనకు కష్టం తరువాత సుఖం, సుఖం తరువాత కష్టం వస్తూ ఉంటాయి, ఇవి ప్రారబ్ధాన్ని బట్టి వస్తూ ఉంటాయి, ఇవి నిజం కాదు. కష్టం అనుభవిస్తే పాపకర్మ పోతుంది, సుఖం అనుభవిస్తే పుణ్యకర్మ పోతుంది. రెండూ అబద్ధమే. మనకు భగవంతుడి పట్ల ఉన్న భక్తి నిజమైతే పుణ్య ప్రారబ్ధం అనుభవిస్తూ ఉంటే వాడికి గర్వం రాదు, పాప ప్రారబ్ధం అనుభవిస్తూ ఉంటే వాడికి దుఃఖం రాదు. పుణ్యం అనుభవించిన, పాపం అనుభవించినా మనస్సు అనుభవిస్తుంది. ఆ మనస్సు భగవంతుని పాదాల దగ్గర ఉంటుంది కాబట్టి భక్తుడికి ఏమీ అనిపించదు అన్నాడు వ్యాసుడు. మన బుద్ధిలో ఉన్న దోషాలు తగ్గించుకోవటానికే యోగం. ఒకచోట గడ్డి ఉంది అనుకోండి అగ్గిపుల్ల వేస్తే మొత్తం గడ్డి అంతా అంటుకొనిపోతుంది. అలాగే

మీ బుద్ధిలో ఎన్ని దోషాలు ఉన్నప్పటికీ భగవంతుని స్మరణ అనే అగ్ని మీ దోషాలను కాల్చేస్తుంది. అరుణాచలం, అరుణాచలం అని స్మరించుకొంటేనే మోక్షం వస్తుందా, మోక్షం అంత తేలికా అని భగవాన్‌ను అడిగితే అది భగవంతుడి యొక్క ఆజ్ఞ అడగటానికి నువ్వు ఎవరు అన్నారు భగవాన్. ఆలోచన, మాట, కర్మ ఈ మూడింటిలో జాగ్రత్తగా ఉంటే భగవంతుడు మనకు లభ్యమవుతాడు. ధనకాంక్ష స్త్రీ కాంక్ష కీర్తి కాంక్ష వీటిని భోగ త్రయం అంటారు. భగవంతుని పాదాలయందు భక్తి లేకపోతే, ఆయన యందు విశ్వాసం లేకపోతే భోగత్రయం నశించదు అని వ్యాసుడు చెప్పాడు. మీకు ఎంత ధనం ఉన్నా, ఎంత తెలివి ఉన్నా భగవంతుని దయ లేకుండా భోగత్రయం నశించదు.

విద్య సంపాదించటానికి, ధనం సంపాదించటానికి మీరు కష్టపడుతున్నారు. ఇలా అన్ని విషయాలలో కష్టపడుతున్నారు కాని భక్తి విషయంలో కష్టపడకుండా వచ్చేయాలి అనుకొంటున్నారు. డబ్బు సంపాదించటం కంటే, విద్య సంపాదించటం కంటే, భక్తి సంపాదించటం చాలా కష్టం. డబ్బు రకరకాలుగా వస్తుంది. యధాలాపంగా ఒక లక్ష పెట్టి కొన్న స్థలం ఈ రోజు 50 లక్షలకు అమ్ముతున్నారు. ఇందులో మన తెలివితేటలు ఏమి ఉన్నాయి. మార్కెట్ అలా పెరిగిపోయింది. భక్తి అంత తేలికగా రాదు, చాలా కష్టపడాలి. నేను సాధన చేస్తున్నాను రేణింపు కనబడటం లేదు అని భక్తుడు శివానంద్‌ను అడుగుతున్నాడు. చేనుకు ఒక కంతలో నుండి నీరు పెడుతూ ఇంకో కంతలో నుండి నీరు వదిలేస్తే ఇంక నీరు ఏమి నిలబడుతుంది. నీవు సాధన చేస్తున్నమాట నిజమే కాని నీవు చేస్తున్న స్నేహాలు చెడు స్నేహాలు అని చెప్పారు. ఇంక నీకు రేణింపు ఏమిటి? ఎదుటివారు చెడు మాటలు చెపుతూ ఉంటే నీకు ఆనందం వస్తోందా అని అడిగారు. ఆనందం వస్తోంది అని చెప్పాడు. ఇంక నీకు భక్తి ఏమిటి అన్నారు శివానంద. చెడ్డమాటలు చెప్పేవాడు భక్తుడు కాదు, వినేవాడు భక్తుడు కాదు. నా హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు అని చెపుతున్నారు. ఆయనను తెలుసుకోవటానికి ఎక్కడికైనా అడవులకు వెళ్ళిపోవాలా అని భగవాన్‌ను అడుగుతున్నారు. నీవు ఎక్కడికి పారిపోనక్కరలేదు. ఆలోచన విషయంలో, మాటల విషయంలో, పనుల విషయంలో జాగ్రత్తగా ఉంటే చాలు అంటున్నారు భగవాన్. ఈ మూడింటి విషయంలో జాగ్రత్తగా ఉండకపోతే నీవు ఎక్కడికి వెళ్ళినా ప్రయోజనం లేదు. ఆత్మజ్ఞానంలో అన్నీ ఉన్నాయి, ఇది లేదు అని చెప్పటానికి ఏదీ లేదు, జ్ఞానంలో సుఖం, శాంతి, ఆనందం, ఐశ్వర్యం అన్నీ ఉన్నాయి, జ్ఞానం యొక్క వైభవం అట్టిది. నీవు ఆత్మజ్ఞానాన్ని సంపాదించు, నీకు అన్నీ సమకూర్చబడును అని శాస్త్రంలో చెప్పారు. మీకు నిజమైన భక్తి కలిగింది అనుకోండి ముందు మీకు ఉన్న భయం నశిస్తుంది.

భగవంతుడు నీకు కేటాయించిన పనిని శ్రద్ధగా చెయ్యి. పనికి జ్ఞానానికి విరోధం

లేదు. కర్మను యోగంగా చేస్తే జ్ఞానం కలుగుతుంది. మనకు శత్రుత్వం వద్దు, మిత్రత్వం వద్దు. ప్రారబ్ధాన్ని బట్టి దేహం వచ్చింది, ప్రారబ్ధాన్ని బట్టి రోజులు ఎలా వెళ్ళిపోవాలో అలా వెళ్ళిపోతాయి. దేహప్రారబ్ధం నశించిన వెంటనే దేహం శవం అయిపోతుంది. ఆ దేహప్రారబ్ధాన్ని బట్టి అంతా జరిగిపోతుంది గాని ప్రత్యేకంగా నాకు లోకంలో ఒకరు ఇష్టులు, ఒకరు అయిష్టులు అని లేనేలేదు అని పరమాత్మ గీతలో చెప్పాడు. నీ కర్తవ్యం ఏదో నీవు ఇష్టంగా, ప్రేమగా చెయ్యి, అంతవరకే. వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదో రాదు. కర్మతో కూడిన జీవితాన్ని నీవు సన్యసించనక్కర లేదు, కర్మఫలాన్ని ఆశించకు మన దేహం ద్వారా ఏ పని జరగాలో ఆ పనే జరుగుతుంది కాని మనకు అదనంగా పని ఏమీ కల్పించడు భగవంతుడు. మనకు కొన్ని కొన్ని విషయాలు అర్థమైతే మనలో ఉన్న అశాంతి, దుఃఖం నశిస్తుంది. మనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా ఈ సృష్టిలో ప్రతీ విషయం ఈశ్వరసంకల్పం ప్రకారం జరుగుతుంది. రాష్ట్రపతి అభ్యర్థిని నిర్ణయించటానికి అనేకమంది కూర్చొని చర్చించి వాడు పనికి రాడు, వీడు పనికి రాడు అని అనుకొంటూ చివరకు ప్రతిభా పాటిల్ పేరును అంగీకరించారు. అది ఆవిడ కోరుకొంటే రాలేదు, ఆ దేహ ప్రారబ్ధం, అంతా ఈశ్వర సంకల్పం. అంతా ఈశ్వర సంకల్పంతో నడుస్తోంది అని మీకు అర్థమైతే అంతా శాంతే, అర్థమవ్వలేదు అనుకో అంతా అశాంతే. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే ప్రారబ్ధాన్ని బట్టి నీ దేహానికి ఏ పని అయితే అప్పగించాడో దానిని అయిష్టంగా చేయవద్దు, విసుగుగా చేయవద్దు, ఇష్టంగా చెయ్యి, ప్రేమగా చెయ్యి. అప్పుడు నీ మనస్సు బాహ్యముఖంగా వెళ్ళటం తగ్గిపోయి మనస్సు లోపలకు వెళ్ళి నెమ్మదిగా నశిస్తుంది. నీ లోపల ఉన్న శాంతి నీకు అందకుండా నీ మనస్సే అడ్డు వస్తోంది. ఇంద్రియాలను జయించటం కష్టం. మనస్సు ఇంద్రియాలను జయించలేదు. భగవంతుని పాదాల దగ్గర మీ మనస్సును కట్టేస్తే ఇంద్రియాలను జయించవచ్చు అని వ్యాసుడు చెప్పాడు. అర్జునుడికి ఇష్టం లేకపోయినా ప్రారబ్ధంలో యుద్ధం చేయవలసి ఉంది, మనం కూడా అంతే. మనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా దేహం ద్వారా జరగవలసిన పని జరిగిపోతూ ఉంటుంది. ఆ చేసేది ఇష్టంగా చేస్తే మనస్సు బాహ్యముఖానికి వెళ్ళదు, మనస్సుకు లోచూపు కలుగుతుంది, మనస్సు నశిస్తుంది. వాసనలు అన్నీ మనస్సులో ఉంటాయి మనస్సు నశించినప్పుడు వాసనలు అన్నీ నశిస్తాయి, అప్పుడు నీవు పరమస్థితిని పొందుతావు.

నీవు ఎంత బిజీగా ఉన్నా పది నిమిషాలు భగవంతుని నామం చేసుకో, ధ్యానం చేసుకో. అలా చేసుకొంటూ ఉంటే నీ పని ఏదో నీవు చేస్తున్నప్పటికీ నీకు తెలియకుండా మనస్సులో నామం జరిగిపోతూ ఉంటుంది. ఆ భక్తి ప్రవాహంలో మీరు చేసే పని తేలికగా ఉంటుంది, మీకు బరువు అనిపించదు. మీ ఇంట్లో మనుషులు కూడా మీ సొంతం కాదు. దేహం

చనిపోతే మీరు ఎక్కడికి వెళ్లిపోతారో, వారు ఎక్కడికి వెళ్లిపోతారో తెలియదు. జన్మాంతర అనుబంధాన్ని బట్టి భగవంతుడు ఇక్కడకు పంపాడు. వారిపట్ల మీ డ్యూటీ మీరు చేయండి, సరిపోతుంది. భక్తి ఉన్న వారికి కోరిక ఏమిటి? కోపం ఏమిటి? కొంతమందికి ఏదో రకమైన భయం వేస్తూ ఉంటుంది. భగవంతుడి పట్ల భక్తి ఉంటే నీకు భయం ఏమిటి? కాఫీలో పంచదార వేస్తే ఆ తీపి మనకు ఎలా తెలుస్తుందో అలాగ నీ లోపల భక్తి ఉంటే, శాంతి ఉంటే ఆ భక్తి యొక్క ప్రభావం, శాంతి యొక్క ప్రభావం నీ ఆలోచనలలో, నీ మాటలలో, నీవు చేసే పనులలో వ్యక్తమవుతుంది. భక్తులు ప్రారబ్దం కూడా అనుభవించనక్కరలేదు, దేహం ప్రారబ్దం ప్రకారం నడుస్తుంది కాని నేను అనుభవిస్తున్నాను అనే భావన భక్తి ప్రవాహంలో కొట్టుకొని పోతుంది. నేను ఏదైతే నేను, నేను అంటున్నానో దానిని పోగొట్టుకోవాలి అని నేను పోగొట్టుకోలేదు. భక్తి ప్రవాహంలో అది ఎప్పుడు పోయిందో, ఎలా పోయిందో నాకు తెలియకుండానే అది కొట్టుకొనిపోయింది అన్నాడు తుకారామ్. నీకు నిజంగా శాంతి కుదిరింది అనుకో, పని ఇష్టంగా చేయగలుగు తున్నావు అనుకో అంతకు ముందు జీవితానికి, ఇప్పటికి తేడా వచ్చేస్తుంది. అంతకు ముందు శత్రువులు ఉన్నా వారు శత్రువులుగా నీకు కనబడరు. వ్యక్తుల పట్ల, సంఘటనల పట్ల నీ మనస్సు పూర్తిగా మారిపోతుంది. నిర్మలమైన మనస్సు లేకుండా, ప్రశాంత చిత్తం లేకుండా నువ్వు ఎవరికైనా మంచి చేసినా వాడు సుఖపడడు. వాడిని నమ్మితే వాడు అలా చేసాడు, వీడిని నమ్మితే వీడు ఇలాగ చేసాడు అని శివానంద్‌తో ఒక భక్తుడు అంటే వాడిది పొరపాటు కాదు, ఎక్కడ జాలి చూపించకూడదో, ఎక్కడ దయ చూపించకూడదో, ఎక్కడ ప్రేమ చూపించకూడదో అక్కడ చూపించావు, అందుచేత అనుభవించు అని చెప్పారు. పాముకు పాలుపోసి పెంచి అది కరిచింది అంటావు ఏమిటి? చెడు ఉన్నచోట నీవు దయచూపించావు అనుకో పాముకు పాలుపోసినట్లు అవుతుంది.

దేనిలోనూ అతిగా ఉండవద్దు, సోమరితనంగా ఉండవద్దు. నీకు 10 రూపాయలు అవసరం అనుకో, 20 రూపాయలు సంపాదించుకొంటే ప్రమాదం లేదు కాని పది ముద్దలు తినేచోట 20 ముద్దలు తింటే రోగం వచ్చేస్తుంది. శరీరానికి అనారోగ్యం, మనస్సుకు అశాంతి. మనం తినే ఆహారం సాత్వికంగా ఉండాలి, మితంగా ఉండాలి. మనకు ఆలోచన, మాట, చేత మూడు శక్తులు ఉన్నాయి. వాటితో భగవంతుడిని పూజించాలి. నువ్వు ఎవరికైనా సహాయం చేస్తున్నావు అనుకో, వ్యక్తికి చేస్తున్నాను అనుకోవద్దు, ఈశ్వరుడికి అనుకో. ఇతరులకు సహకారం చేసే శక్తి నీకు లేకపోయినా వారు బాగుపడాలి అని నీవు సంకల్పించినా అది కూడా నీవు భగవంతుడికి చేసే పూజ అవుతుంది. అలా చేయటం వలన నీకు చిత్త శుద్ధి కలుగుతుంది. మనకు రోగం వచ్చింది అనుకో ఏ కారణం వలన రోగం వచ్చిందో ఆ కారణం పోతేగాని రోగం

తగ్గదు. అదేవిధంగా నీవు ఏ గుణాల వలన ఈ ప్రకృతిలో పడ్డావో, ఈ మాయలో పడ్డావో ఆ గుణాలను అతిక్రమించకుండా నీవు ఈ మాయలో నుండి, ప్రకృతిలో నుండి బయట పడలేవు. ఏ కారణం వలన నీకు ఈ లోకం మీద మోహం కలుగుతోందో ఆ కారణం పోతేగాని నీకు లోకం మీద ఉన్న మోహం పోదు. అందుచేత మీరు సబ్జక్టు బాగా అర్థం చేసుకోవాలి. దేహం అహంకారం కాదు కాని అహంకారాన్ని పెంచే గుణం దేహానికి ఉంది. ఆత్మకు అహంకారానికి ఏమీ సంబంధం లేదు కాని సంబంధం ఉందని మనం అనుకొంటున్నాము దానికి ఏదో కారణం ఉంది. ఆకారణం పోతేగాని సంబంధం లేదు అన్న సంగతి మనకు తెలియదు.

నీవు పని చేస్తూ ఉంటే భగవంతుడిని మర్చిపోనక్కరలేదు, మనస్సును భగవంతుని మీద పెట్టి చేతులతో పని చేసుకో. భగవంతుడి యొక్క శక్తి, వైభవం మనకు తెలియటం లేదు. రాముడు, కృష్ణుడు మనలాంటి వారే అనుకొంటే ఇంక వారి మీద భక్తి ఎలా కలుగుతుంది. ఈశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వశక్తి మంతుడు. కళ్ళతో చూసి ఈ సృష్టిని నాశనం చేయగల శక్తి ఉన్నవారికి మన అజ్ఞానం పోగొట్టటం ఎంత? మనకు పుణ్యబలం లేకపోతే భగవంతుడి యొక్క వైభవం మనకు తెలియదు. మాయను కల్పించినవాడు ఆయన. మనం మాయకు లోబడి ఉన్నాము. ఆయన కూడా మాయకు లోబడి ఉన్నట్లు నటిస్తాడు. ఈశ్వరుడు మీకు కేటాయించిన పనిని శ్రద్ధగా, ప్రేమగా, విసుగు లేకుండా చేస్తూ ఉంటే పూర్వజన్మల నుండి వచ్చిన దోషాలు ఏమైనా ఉంటే అవి పోతాయి, కొత్త దోషాలు మీ బుద్ధికి రావు. మీరు తిన్న అన్నాన్ని జఠరాగ్ని రూపంలో ఉండి పచనం చేస్తున్నాను అలాగే నన్ను స్మరించటం వలన మీ బుద్ధిలో ఉన్న దోషాలను హరిస్తాను అని పరమాత్మ చెప్పాడు. మీ జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. ఈ సంఘటనలు ఇలా జరుగుతున్నాయి ఏమిటి అని అనుకోవద్దు, ఆ సంఘటనల నుండి పాఠాలు నేర్చుకుంటే ఏ కారణం వలన అయితే ఆ సంఘటన జరిగిందో ఆ కారణం పోతుంది, మరల ఆ సంఘటన రిపీట్ అవ్వదు. నీవు చేసే పని నిదానంగా, శాంతిగా చేస్తే బంధంలో నుండి బయటకు వస్తావు, అశాంతిగా చేస్తే బంధం పెరిగిపోతుంది. ఎవడి ప్రారబ్ధాన్ని బట్టి వాడి రోజులు వెళ్ళిపోతున్నాయి. భగవంతుడికి కొందరు ఇష్టులు, కొందరు అయిష్టులు అని జనం అనుకొంటారుగాని నాకు ఇష్టుడు లేడు, అయిష్టుడులేడు అని పరమాత్మ చెపుతున్నాడు. ఇంటి దగ్గర చేసే పనులు కూడా సొంత పనులు అనుకోవద్దు, ఈశ్వరుడు మనకు కేటాయించిన పని అనుకోండి. ఏ ఈశ్వరుడు అయితే మీకు ఆ పనులను కేటాయించాడో ఆయనే మీ హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. అంతర్యామిగా ఉన్న పరబ్రహ్మం మీద మనస్సును పెట్టు, మీకు కేటాయించిన పని మీద చేతులు పెట్టు సరిపోతుంది. అప్పుడు పని అయిపోతుంది. ఇంక కర్మ మిమ్మల్ని బంధించదు. మనస్సు పరమాత్మ మీద ఉంది కాబట్టి ఆయనలో ఐక్యమవుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఆగష్టు | 19 | తాడేపల్లిగూడెం, షిర్డిసాయిబాబా కళ్యాణ మండపం |
| ఆగష్టు | 26 | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |
| సెప్టెంబర్ | 04 | పాలకొల్లు, క్షత్రియ కళ్యాణ మండపం     కృష్ణాష్టమి |
| సెప్టెంబర్ | 09 | అయి భీమవరం, షిరిడీ సాయిబాబా ఆలయం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**



దిll 04-07-2007 పాలకొల్లు క్షత్రియ కళ్యాణ మండపంలో
అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవ కార్యక్రమంలో
వైజాగ్ వాస్తవ్యులు శ్రీ పి.ఎస్.ఎన్. రాజుగారిని మరియు
జస్టిస్ శ్రీ పి. రామకృష్ణంరాజుగారిని సన్మానిస్తున్న
సద్గురు శ్రీ నాన్నగారు మరియు క్షత్రియ కమిటీ సభ్యులు



విశాఖపట్నంలో సద్గురు శ్రీ నాన్నగారితో
విశ్రాంత కలెక్టరు శ్రీ సింహాచలం రాజుగారు



సాహిత్య విశారద, విద్యా వాచస్పతి ఆచార్య అప్పల సోమేశ్వర శర్మగారు
విశాఖపట్నంలో సద్గురు శ్రీ నాన్నగార్కి స్వాగతం పలుకుతున్న దృశ్యం